ఎల్బీనగర్‌లో పెరిగిన ఓటర్ల సంఖ్య

కొత్త ఓటర్లు	26,896
మొత్తం ఓటర్లు	5,66,816
పురుషులు	3.09,552
మహిళలు	2,84,021
ఇతరులు	131



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఓటర్లు భారీగా పెరిగారు. గతం నెలలో ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రకారం 5,66,816 మంది ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా ఓటరు నమోదుకు అక్టోబర్ 30 వరకు గడువు ఇచ్చింది. దీంతో కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడంతో 26,896 మంది పెరిగారు. ప్రస్తుతం నియోజకవర్గం లో పెరిగి ఓటర్ల సంఖ్య 5,93,712 మంది. ఇందులో పురుషులు 3,09,552 కాగా మహిళలు 2,84,021 మంది ఉన్నారు. ఇక ఇతరులు 131మంది. నియోజకవర్గంలో పెరిగి ఓటర్ల సంఖ్య ప్రకారం పోలింగ్ బూత్‌లు 570 ఏర్పాటు చేస్తున్నారు.

ఒకవైపు ప్రచారం.. మరోవైపు ఓట్లు రాబట్టే వ్యూహాలు

- సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం ఉధృతం చేసిన ప్రధాన పార్టీలు
- ఓట్లు ఎలా రాబట్టాలనే లెక్కలు వేస్తున్న నాయకులు
- ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల చిత్రం ఇదీ

ఎల్‌బీనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమైన నామినేషన్ల పర్వం ముగిసింది... ఉపసంహరణ మాత్రమే మిగిలింది.... మరో 20 రోజుల్లో పోలింగ్ జరగనుంది. దీంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. దీపావళి పండుగ తర్వాత ప్రచారాన్ని తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. సభలు, సమావేశాలు, ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడం ఒక ఎత్తైతే... మరో వైపు తమ విజయానికి కావాల్సిన ఓట్లు ఎలా రాబట్టుకోవాలనే లెక్కలు వేస్తూ ఆయా పార్టీల అభ్యర్థులు, నేతలు వ్యూహాలు రచిస్తున్నారు.

బీఆర్‌ఎస్: లబ్ధిదారుల లిస్టు ముందు పెట్టుకుని...

మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు, నేతలు కసరత్తు చేస్తున్నారు. ఎలాగైనా విజయం సాధించాలనే సంకల్పంతో ఓట్ల వేట మొదలుపెట్టారు. దళిత బంధు, బీసీ బంధు, పెన్షన్లు వంటి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, 118 జీఓ వల్ల లబ్ధిపొందిన వారి జాబితాలు పట్టుకుని నేరుగా వారికే ఫోన్ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

బీజేపీ : పాదయాత్రలు, సమావేశాలతో....

బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ ఎన్నికల హామీ ఇచ్చింది. ఈ అంశాన్ని జనంలోకి తీసుకెళ్లి ఓట్లు పొందేందుకు ఆ పార్టీ స్థానిక నేతలు కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న బీసీ ఓట్లపై లెక్కలు వేసి కులాల వారీగా సమావేశాలు నిర్వహించి ఓట్లు రాబట్టుకునేందుకు యత్నిస్తున్నారు. యువ ఓటర్లు బీజేపీకి ఓట్లు వేసేందుకు మోదీ మంత్రాన్ని జపిస్తున్నారు. డివిజన్ల వారీగా కార్పొరేటర్లు ప్రచారం చేస్తూ తాము పరిష్కరించిన సమస్యలను కాలనీ ప్రజలకు వివరిస్తున్నారు.

కాంగ్రెస్: బీసీనేతను నన్ను దీవించండి..

ఈ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని, అందుకే తనను దీవించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంక్‌ను విశ్లేషిస్తునే ఈసారి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు ఎన్ని వచ్చే అవకాశం ఉంది, బీజేపీకి పడే ఓట్లు ఎన్ని అని అంచనా వేస్తున్నారు. గతంలో ఇక్కడ కాంగ్రెస్ పార్టీనే గెలిచింది కాబట్టి మరోసారి కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని చూస్తున్నారని, డివిజన్ల వారీగా ఓట్లను అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో భారీగా బీసీ ఓటర్లు ఉన్నారని, సగంకు పైగా బీసీ అభ్యర్థికే మద్దతు ఇస్తారని ఆశతో కూడా కాంగ్రెస్ పార్టీ ఉంది

కాంగ్రెస్ పార్టీది పీపుల్స్ మేనిఫెస్టో

ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీది పీపుల్స్ మేనిఫెస్టో అని, ప్రజల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టి వాటిని పరిష్కరించడమే తన ధ్యేయమని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం బీఎన్ రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని వివేకానంద పార్క్‌లో వాకర్స్‌ను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వైదేహినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో, బీఎన్‌రెడ్డినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ఆయన కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మకుటం సదాశివుడు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలక్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

– అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



అక్బర్‌బాగ్‌లో ప్రచారం చేస్తున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగుర వేయడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. శనివారం అక్బర్‌బాగ్‌లో డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. నరసింహ, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యుడు రామరావు, మలక్‌పేట కన్వీనర్ నవీన్ రెడ్డి, రమేష్, ఎల్‌బీ శాస్త్రి, భార్గవ చారి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తా...

– మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్



మూసారంబాగ్‌లో ప్రచారం చేస్తున్న అక్బర్

మలక్‌పేట: ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మూసారంబాగ్ డివిజన్‌లోని సంజీవయ్యనగర్, ఖాదర్ ఆసుపత్రి లైన్, మూసారంబాగ్ బస్తీ తదితర ప్రాంతాలలో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి హస్తం గుర్తుకు ఓటువేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో సీనియర్ నేత విజయసింహా రెడ్డి, యూత్ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు సింగిరెడ్డి, బాలకృష్ణ యాదవ్, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఎస్పీ ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం

– పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి గువ్వల సాయిరాంకృష్ణ

నాగోలు: రాష్ట్రంలో బహుజన సమాజ పార్టీ (బీఎస్పీ) ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి గువ్వల సాయిరాంకృష్ణ అన్నారు. శనివారం నాగోలు డివిజన్ జైపురి కాలనీలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ రాజకీయ పార్టీలో లేని విధంగా బహుజన సమాజ్ పార్టీ అన్ని బీసీ వర్గాలను కలుపుకొని 70 శాతం ఎమ్మెల్యే స్థానాలు కేటాయించారని తెలిపారు. తెలంగాణలో పేద బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారం కోసం బీఎస్పీ పని చేస్తున్నదని అన్నారు. పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వేముగంటి సంపత్, మహిళా కన్వీనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

– ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ కృష్ణాదిశేషు పెంటపాటి

వనస్థలిపురం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు బలమైన ఆయుధం... దానిని సద్వినియోగం చేసుకోవడం మన విధి అని సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్, సామాజికవేత్త కృష్ణాదిశేషు పెంటపాటి అన్నారు. సమాజం, రాష్ట్ర, దేశ భవిష్యత్ బాగుండాలని కోరుకునే ప్రజలకు ఇది ఒక సువర్ణ అవకాశమన్నారు. ఓటర్లు ఓటు వేసే ముందు విచక్షణతో విశ్లేషించి నిర్ణయం తీసుకోవాలి. తాత్కాలికమైన తాయిలాలకు ఆశపడకుండా, కుల, మతాలకు అతీతంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం గల నాయకులను ఎన్నుకోవాలని ఆయన సూచించారు.

సెయింట్ జేవియర్స్‌లో దీపావళి సంబరాలు



మలక్‌పేట: అక్బర్‌బాగ్ ప్రొఫెసర్ కాలనీలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో శనివారం దీపావళి సంబురాలు ఘనంగా నిర్వహించారు. దీపారాధన, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మన పండుగలు, పర్వదినాల గొప్పతనం పిల్లలకు అవగాహన కలిగించాల్సిన అవశ్యకత ఉందని ప్రిన్సిపాల్ హిజ్కియా అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ముగ్గురు యువకుల బైండోవర్

హస్తినాపురం: నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ తిరుగుతున్న ముగ్గురు యువకులను వనస్థలిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వనస్థలిపురం సీఐ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఓంకార్‌నగర్ మల్లికార్జుననగర్‌కాలనీకి చెందిన బొడిగ మహేశ్ (19), కేశవోని కిరన్ (19), రంగారెడ్డి జిల్లా కర్మన్‌ఘాట్, బైరామల్‌గూడకు చెందిన తుమ్మల శివ(19)లు నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురినీ హయత్‌నగర్ మండల తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని సీఐ జలేందర్ రెడ్డి తెలిపారు.

ప్రజాతీర్పును అపహాస్యం చేసిన వ్యక్తికి ఓటుతో బుద్ధి చెప్పండి

ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి



వనస్థలిపురంలో కాలనీవాసుల సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

ఎల్‌బీనగర్: ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఈసారి ఓటుతోనే బుద్ధి చెప్పాలని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వనస్థలిపురం డివిజన్‌లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌లో గెలిచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఢిల్లీ ప్రాంతాల్లో ఉండనని, స్థానికుడినైన నేను నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రధాని మోదీ మార్గంలో నడిచే కార్యకర్తనని, సబ్ కాసాత్... సబ్ కా వికాస్... సబ్ కా విశ్వాస్ నినాదంతో పనిచేస్తానన్నారు.

బీఎన్‌రెడ్డినగర్‌లో...

బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిని గెలిపించాలని శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శరత్, జైపాల్‌రెడ్డి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్..

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డివిజన్ పరిధి సూర్యోదయనగర్‌కాలనీ, శ్రీనివాసనగర్‌కాలనీలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిని ఓటేసి గెలిపించాలని శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సేవ చేసే అవకాశం కల్పించండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని న్యూ నాగోల్ కాలనీ, స్నేహపురి కాలనీ సీనియర్ సిటిజన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్, స్నేహపురి కాలనీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, న్యూ నాగోల్ కాలనీ అధ్యక్షుడు మదుసుధన్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫారం అధ్యక్షుడు జ్ఞాన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మరోమారు గెలిపించండి

బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి మంత్రి సబితారెడ్డి



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: తమది పేద, మధ్య తరగతి ప్రజల ప్రగతి ప్రభుత్వమని మహేశ్వరం అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఫేజ్-2,3 లకు చెందిన బీజేపీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్, కుమార్, కృష్ణ, సోములు తమ అనుచరులతో కలిసి శనివారం సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధికి కేరాఫ్ అయిన బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోన నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. సంక్షేమం కావాలా..సంక్షోభం వావాలా అని ప్రశ్నించారు. సామాన్యుల అభ్యున్నతి లక్ష్యంగా, ప్రజలందరూ సమానంగా ఎదగాలని కేసీఆర్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. మీ కోసం మీలో ఒకరిగా, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి బాధ్యతతో పనిచేస్తా నన్ను మహేశ్వరం ఎమ్మెల్యేగా మరొక్కమారు గెలిపించాలని సబితారెడ్డి కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేష్, సీనియర్ నాయకులు సాజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్‌ఆర్



కొత్తూర్‌లో మాట్లాడుతున్న కేఎల్‌ఆర్

కందుకూరు: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం తథ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని 15 గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహించారు. వివిధ గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చిగురింత పారిజాత, వైస్ ఎంపీపీ జి.శమంత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేష్, నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలోని బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు భారీ ఎత్తున కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఢిల్లీ వెంకటేష్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ దేరంగుల నర్సింహతో పాటు ఉప సర్పంచ్ శకుంతల, వార్డు సభ్యులు తదితరులు శనివారం కేఎల్‌ఆర్ కార్యాలయంలో ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.మదన్‌పాల్‌రెడ్డి, ఎ.జగదీష్‌బాబు, బి.జంగయ్య, కె.సత్తయ్య, జి.రవి, పి.మధుసూదన్, విష్ణు పాల్గొన్నారు.

శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



మలక్‌పేట: శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా గుండవరం వేణుగోపాలరావు, వైస్ ప్రెసిడెంట్లుగా అహ్మద్ బాషా, గిరిధర్, సెక్రటరీ జీవీ రామారావు, జాయింట్ సెక్రటరీ కొండారెడ్డి, స్పోర్ట్స్ సెక్రెటరీ భవాని శంకర్, కార్యవర్గ సభ్యులుగా రాజేందర్, ఉమామహేశ్వరరావు, ఎం.మధుసూదన్, కె.మధుసూదన్, కార్తీక్, పవన్ కుమార్, మనోభావే, భారతి, శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా ఎన్నికయ్యారు.

ఘనంగా మైనార్టీ వెల్ఫేర్ డే



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వినీల

మన్సూరాబాద్: అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని బాలానగర్ గర్ల్స్-1 జూనియర్ కాలేజీలో మైనార్టీ వెల్ఫేర్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన, చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వినీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సదర్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



చంచల్‌గూడ: దీపావళి సందర్భంగా చంచల్‌గూడ మెయిన్ రోడ్డులో ఈ నెల 13న చావుణి, ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ మేళాను ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం సభ్యుడు నిరంజన్‌యాదవ్, రాంపాల్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక రామాలయంలో సదర్ మేళా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. మేళాలో భాగంగా దున్నపోతుల ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుందని, యాదవులు తమ దున్నలను సకాలంలో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంపత్‌యాదవ్, బలరాజుయాదవ్, ధన్‌రాజ్‌యాదవ్, అమర్ యాదవ్, అనిల్‌యాదవ్, రాహుల్‌కిషోర్‌యాదవ్, యాట ప్రమోద్, రాంనరేష్‌యాదవ్, పెద్దియాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

ఎల్‌బీ నగర్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రియదర్శిని పార్కులో వాకర్స్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి



జైపురి కాలనీలో మంగళహారతితో సుధీర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళ

చంపాపేట/మన్సురాబాద్/నాగోల్/లింగోజిగూడ: రాష్ట్రంలో సంక్షేమ పాలన బీఆర్‌ఎస్ పార్టీ మరోమారు అధికార పగ్గాలు చేపట్టడంతోనే సాధ్యపడుతుందని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం లింగోజిగూడ, నాగోల్, మన్సురాబాద్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటువేసి తనను మరోమారు గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో మహిళలు సుధీర్‌రెడ్డికి మంగళహారతులు ఇచ్చి నుదుటున తిలకం దిద్ది ఆశీర్వదించారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ సుధీర్‌రెడ్డికే తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు బోయిని మహేందర్ యాదవ్, రవి, భాస్కర్, తిలక్, సత్యం, శంకర్, ఆశోక్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాగోల్‌లో....

నాగోల్ డివిజన్ విశాలాంధ్ర, రాఘవేంద్ర, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, శైలజాపురి, అవెన్యూ హోమ్స్, జైపురి, సాయినారాయణ తదితర కాలనీలలో సుధీర్‌రెడ్డి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారుగుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. నాయకులు కుంట్లూరి వెంకటేష్‌గౌడ్, అనంతుల రాజిరెడ్డి, చెరకు సంగీతాప్రశాంత్, ప్రమీల, శిల్ప, మైసయ్య, సీతారాములు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

జీఓ 118 లబ్ధిదారుల ఆధ్వర్యంలో మన్సూరాబాద్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. సుధీర్‌రెడ్డి ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఓ 118 ను జారీ చేయించి తమ కాలనీల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరింజేసిన సుధీర్‌రెడ్డికి ఘన విజయాన్ని బహుమానంగా ఇస్తామని 118 లబ్ధిదారులు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసులు దాడులు..

- భారీగా పటిక, నల్లబెల్లం స్వాధీనం
- ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న పటిక, నల్ల బెల్లంతో పాటు నిందితుడిని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మలక్‌పేట: అక్రమంగా పటిక, నల్ల బెల్లం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తెలిపిన వివరాలు.. చంపాపేట భానునగర్‌కు చెందిన బి. రమేష్(46) సింగరేణి కాలనీలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. ఇతను సారా తయారీలో వాడే పటిక, నల్ల బెల్లం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి రమేష్ దాడి చేసి 900 కిలోలు నల్ల బెల్లం, 800 పటిక స్వాధీనం చేసుకున్నారు. పటిక నల్లబెల్లం విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. తనిఖీల్లో ఎస్సైలు శివ చరణ్ రెడ్డి, అనీస్ ఉద్దీన్, సిబ్బంది శ్రీనివాస్, ప్రసాద్, శంకర్, సురేందర్, కవిత, పావని పాల్గొన్నారు.